క్లుప్తంగా

ప్రభుత్వ భూమి పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: స్థానిక శ్రీలక్ష్మి కేశవ పెరమాండ్ల గుట్ట వద్దగల 14 ఎకరాల భూమికి సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అధికారులు హద్దులు నిర్ణయించారు. ఇటీవల పాలకవర్గం సమావేశమై ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నిర్ణయించాలని తీర్మానించారు. ఈ ప్రదేశంలో శ్మశాన వాటిక, కల్లాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లిలో నాయి బ్రాహ్మణ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వినతిపత్రం అందచేశారు. గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అక్కెనపెల్లి కరుణాకర్, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తంగళ్లపల్లి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

శాలివాహన జయంతి



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కోనరావుపేట: మండల కేంద్రంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల శాలివాహన సంఘం అధ్యక్షుడు వంగపెల్లి పర్శరాములు, వైస్‌ఎంపీపీ సుమలత, ప్రధానకార్యదర్శి వంగపెల్లి దేవరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జెండావిష్కరణ



జెండా ఆవిష్కరించిన నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు భీమునిమల్లారెడ్డిపేట గ్రామంలో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ముదిరాజ్ సంఘం జెండాను నాయకులు ఆవిష్కరించారు. ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండాలని, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. నాయకులు దండవేని లక్ష్మణ్, ఈరవేని లక్ష్మయ్య, రమేష్, నాగారపు దేవేందర్, రమేష్, పిట్ల బాబు, నర్సయ్య, శ్రీశైలం, సత్యం, మీనయ్య, సుభాష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



గంభీరావుపేటలో..



రుద్రంగి: మానాలలో పంచాగ శ్రవణం చేస్తున్న వేద పండితులు



రుద్రంగిలో పంచాగ శ్రవణం



వేములవాడరూరల్: వట్టెంల హనుమాన్ ఆలయంలో..

ఉగాది శోభ

పల్లెల్లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది శోభ సంతరించుకుంది. గుమ్మాలు మామిడాకుల తోరణాలతో కళకళలాడాయి, ఇంటిల్లిపాది మంగళ స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలంకరణతో షడ్రుచుల ఉగాది పచ్చడి ఆరగించారు. ఎల్లమ్మ దేవతకు నవధాన్యాలు, పసుపు, కుంకుమ, కొత్త బట్టలను చాటలో పెట్టి మొక్కుకున్నారు. పిండివంటలు ఆరగించిన తరువాత చిన్నపిల్లలకు, పెళ్లయిన కొత్త జంటలకు బత్తిసాలు వేసి వేడుక చేసుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో దైవ దర్శనంతో పాటు వేద పండితుల పంచాంగ శ్రవణాన్ని వినేందుకు వచ్చిన వారితో కిటకిటలాడాయి. తమ రాశి ఫలాలు, ఆదాయ, వ్యయాల గూర్చి అడిగి తెలుసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇందిరమ్మకాలనీలో పంచాగ శ్రవణం



ఇల్లంతకుంట: పెద్దలింగాపూర్‌లో



ముస్తాబాద్‌లో పంచాంగం చెప్తున్న పండితులు

మొక్కల సంరక్షణ గాలికి..

- నీరు లేక ఎండుతున్న హరితహారం మొక్కలు
- ట్రీగార్డులు కరువు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్లఅర్బన్: ఊరురా పచ్చదనం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. మొక్కల సంరక్షణ బాధ్యతను మరిచిపోవడంతో ఎండిపోయే పరిస్థితి దాపురించింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధి వీలిన గ్రామాలైన పెద్దూరు, సర్దాపూర్, చంద్రపేట, రగుడు, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, సర్దాపూర్, జగ్గారావుపల్లే, బోనాలలోని రోడ్లకు ఇరువైపుల, సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డు డివైడర్ మధ్యలో, రోడ్డుకు ఇరువైపుల దాదాపు 60 వేల పైగా మొక్కలను నాటారు. నాటిన కొన్ని రోజుల వరకు ట్యాంకర్ల ద్వారా సిబ్బందితో నీరు పోయించారు. కాని ఆ తరువాత వాటి సంరక్షణ గాలికి వదిలేశారు. దీంతో చాలాచోట్ల మొక్కలన్నీ ఎండిపోయి వెక్కిరిస్తున్నాయి.



నీళ్లు లేక ఎండుతున్న మొక్కలు

పర్యవేక్షణ లోపం

ప్రస్తుతం ఉష్ణోగ్రతల్లో మార్పులతో ఎండ వేడిమి తట్టుకోలేక మొక్కలు మాడిపోతున్నాయి. ఉన్న మొక్కలను రక్షణ కరువైంది. లక్షలు వెచ్చించి, అర్భాటంగా ప్రారంభించిన హరితహారం లక్ష్యం నెరవేరడం లేదు. చాలా ప్రాంతాల్లో మొక్కలకు రక్షణకు జాలీలు ఏర్పాటు చేయక మేకలు, గొర్రెల బారిన పడుతున్నాయి. మొక్కలకు ఊతగా కర్రలు ఏర్పాటు చేయకపోవడంతో, గాలికి, పూర్తిగా వంగి విరిగి పోతున్నాయి. ఉన్న మొక్కలకైనా నీరు పోసి రక్షించుకోవాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



సిరిసిల్ల రెండో బైపాస్‌లో రోడ్డుకు ఇరువైపుల, డివైడర్ మధ్యలో నాటిన మొక్కలకు తొలి రోజుల్లో నీరు అందించారు. ఆ తర్వాత వాటి సంరక్షణను గాలికి వదిలేయడంతో ఎండిపోతున్నాయి. వేసవి దృష్ట్యా మొక్కలకు ప్రతిరోజు నీరు పట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వంగ మల్లేశం, రగుడు

ట్రీగార్డులు ఏర్పాటు చేయాలి



వీలీన గ్రామాల్లో నాటిన మొక్కలను సరంక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల నీరు లేక ఎండిపోతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో మొక్కలకు ఊత కర్రలు లేక వంగి విరిగిపోతున్నాయి. ట్రీ గార్డుల ఏర్పాటు లేక మొక్కలు పశువులు, మేకలకు ఆహారంగా మారుతున్నాయి.

– కొంపెల్లి ప్రశాంత్, పెద్దూరు

సమాచారం

24న అర్బన్ బ్యాంకు మహాసభ

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు మహాసభ శుక్రవారం ఉదయం 11 గంటలకు బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్ గడ్డం విఠల్ అధ్యక్షతన జరుగనున్నట్లు బ్యాంకు సీఈవో చీటి ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పద్మశాలీ కల్యాణ భవన్‌లో అర్బన్ బ్యాంకు అర్ధ సంవత్సరపు మహాసభలో 2023–2024 సంవత్సరపు అంచనా బడ్జెట్ ఆమోదించాల్సి ఉంటుంది. సర్వసభ్య మహాసభకు సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నియామకం

భట్రాజు సంఘం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనర్సింహారాజు

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం జిల్లా అధ్యక్షుడిగా నన్నపరాజు లక్ష్మీనర్సింహారాజు, ప్రధాన కార్యదర్శిగా కేశవరాజు చంద్రశేఖర్‌రాజు ఎన్నికయినట్లు ఎన్నికల పరిశీలకులు అంబటి రవీందర్‌రాజు, సీవీ జీవన్‌రాజు, బాలకిషన్‌రాజు బుధవారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరాజు, చక్రహరి లక్ష్మణ్‌రాజు, కోశాధికారిగా బ్రహ్మాండభేరి జగన్‌మోహన్‌రాజు, సహాయ కార్యదర్శులుగా చెన్నమాధవుని రాజసత్యం, నన్నపురాజు బాపురాజు, ప్రచార కార్యదర్శిగా కేశవరాజు లక్ష్మణ్‌రాజు, కార్యవర్గసభ్యులుగా మరో ఏడుగురిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు

వేములవాడ గౌరవాన్ని పెంచారు

వేములవాడ: నీట్ పీజీ సెట్‌లో ఆలిండియాలో 2014వ ర్యాంకు సాధించిన కొమురవెళ్లి సుదీప్‌వాస్ వేములవాడ గౌరవాన్ని పెంచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కొనియాడారు. ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం పలువురు ప్రముఖులను పార్టీ కార్యాలయంలో సన్మానించే కార్యక్రమంలో భాగంగా సుదీప్‌వాస్ సన్మానించారు. నాయకులు కుమ్మరి శంకర్, గోపు బాలరాజు, రేగుల మల్లికార్జున్, బండ మల్లేశం, అన్నారం శ్రీనివాస్, తిరుపతి, కోల కృష్ణ, పిన్నింటి హన్మండ్లు, మహేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సుదీప్‌వాస్‌ను సన్మానిస్తున్న ప్రతాప రామకృష్ణ

చిత్రకథ



విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజపల్లిలో స్తంభాలకు విద్యుత్ లైట్లు లేకపోవడంతో కాలనీ చీకటిమయంగా మారిందని కాలనీవాసులు అంటున్నారు. నూతన స్తంభాలు బిగించినప్పటికీ వాటికి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం లేదని వారు అంటున్నారు.

క్రైమ్ కార్నర్

కర్రలతో దాడి.. ముగ్గురిపై కేసు

చందుర్తి: ఫారెస్టు అధికారులు సీజ్ చేసిన బ్లేడు ట్రాక్టర్‌కు పరిహారం కోసం ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదం చివరికి కర్రలతో దాడి చేసుకునే వరకు దారితీసింది. మండలంలోని దేవునితండాకు చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిల్లెల్ల రమేశ్ తెలిపారు. గత 15 రోజుల క్రితం దేవునితండాకు చెందిన అజ్మీరా రవి, గుగులోతు శేఖర్ బ్లేడ్ ట్రాక్టర్‌తో అటవీ భూమిను చదును చేస్తుండగా గుగులోతు శేఖర్ బ్లేడు ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ సంఘటన నుంచి అజ్మీర రవి తన ట్రాక్టర్‌ను తప్పించాడు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇద్దరు కలిసి పనిచేస్తుండగానే ట్రాక్టర్ దొరికిందని.. కేసు ఖర్చులు సైతం ఇద్దరం భరించాలని శేఖర్ కోరాడు. మాట..మాట పెరిగి అజ్మీర రవి, రాజేందర్, జలందర్‌లు కలిసి గుగులోతు రవి, భూక్య లక్ష్మణ్, భూక్య సంతోష్‌లపై కర్రలతో దాడికి దిగారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అకాల వర్షాలు పడొద్దని ఆలయంలో ముడుపులు

ఎల్లారెడ్డిపేట: అకాల వర్షాలు పడకుండా చూడాలని కోరుతూ మండలంలోని నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రైతులు ముడుపులు కట్టారు. ఉగాది పర్వదినం నాడు ముడుపు కడితే అకాల వర్షాలు పడవనేది రైతుల నమ్మకం. రైతులు ఎంతో నిష్టతో ముడుపులు కడితే ఇప్పటి వరకు అకాల వర్షాలు పడలేదనేది రైతులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ అపేరాసుల్తానా, రైతులు పాల్గొన్నారు.



అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- నిధులు లేక మధ్యలోనే ఆగిన నిర్మాణాలు
- కిటికీలు, దర్వాజలు దొంగల పాలు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో నాలుగు అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా రెండు కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో రెండు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నాయి. సొంత భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. వీటికి నిధులు లేక మధ్యలోనే నిర్మాణాలు నిలిపివేశారు. భవనాలకు బిగించిన కిటికీలు, దర్వాజలు కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. చాలా ఏళ్లుగా శాత్రాజుపల్లిలో అద్దె భవనంలోనే అంగన్‌వాడీ సెంటర్ కొనసాగుతున్నాయి. చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లు అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనే కొనసాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సొంత భవనాలు ఉన్నా అక్కడ సరైన సౌకర్యాలు లేక చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అంగన్‌వాడీ భవనాలు, సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వట్టెంలలో పగుళ్లు చూపిన అంగన్‌వాడీ సెంటర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని హరిదాస్‌నగర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేట తండాకు చెందిన సురేశ్‌నాయక్, రాములు బైక్‌పై సిరిసిల్ల నుంచి వస్తుండగా అదుపు తప్పింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేటలో ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాగట్లపల్లి వద్ద..

మండలంలోని రాగట్లపల్లి మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన శంకర్ గాయపడ్డాడు. శంకర్ ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా రాగట్లపల్లి మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న శంకర్‌ను స్థానికులు 108 వాహనంలో సిరిసిల్లకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంపులు సీజ్

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపులను మంగళవారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం దుమాలలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం సర్పంచ్ కదిరె రజిత, వైస్‌ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్ పంపిణీ చేశారు.